# మీరేమంటారు?

"సుమిత్ర సీరియస్" అన్న టెలిగ్రామందుకుని గంపెడు గాబరా, పుట్టెడు దుఃఖంతో క్షణాలమీద బయలుదేరారు హనుమంతరావు, సత్యవతమ్మ గార్లు. టేక్సీ ఎక్కబోతున్న హనుమంతరావు ఒక్క క్షణం ఆగి ఏదో గుర్తొచ్చినట్లు లోపలికెళ్ళి బీరువా లోంచి ఓ కవరు తీసి జేబులో పెట్టుకుని వచ్చి టేక్సీ ఎక్కాడు.

హనుమంతరావు, సత్యవతమ్మలు మాటలురాని వాళ్ళల్లా టేక్సీలో చెరోమూలకీ కూర్చున్నారు. సుమిత్రగురించే ఆ ఇద్దరి హృదయాలు కొట్టుకుంటున్నప్పటికి హనుమంతరావు మాత్రం బాధని బైటికి కనపర్చకుండా గంభీరంగా ఏదో ఆలోచిస్తున్నాడు. గుండెనిండా బాధ, బెంగా నింపుకున్న సత్యవతమ్మ మాత్రం మాటిమాటికీ, కొంగుతో కళ్ళూ, ముక్కూ తుడుచుకుంటోంది. టెలిగ్రాంలో 'సీరియస్' అని మాత్రమే వుండటంతో ఏంజబ్బో ఏమిటో అర్థంకావట్లేదిద్దరికీ.

నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ బస్ శరవేగంతో దూసుకుపోతోంది. హనుమంతరావు, సత్యవతమ్మల మనసంతా గందరగోళంగా వుండి ఆ బస్సు నడక నత్తనడకలా అనిపిస్తోంది. వారి ఆత్రుత ఇంకా స్పీడుగా ఆ బస్సు గమ్యాన్ని చేరిస్తే బాగుండుననిపిస్తోంది. సత్యవతమ్మకయితే ఆ క్షణాన తనకి రెక్కలు మొలిస్తే సెకన్లమీద ఎగిరివెళ్ళి సుమిత్ర దగ్గర వాలాలని వుంది. 'అనారోగ్యంగా వున్నట్టు ముందుగా ఓ కార్డుముక్కయినా లేకుండా ఒకేసారి సీరియస్ అనే టెలిగ్రామేమిటి?' అనుకుంది సత్యవతమ్మ.

చేరవలసిన టైముకి చేరిన బస్సు దిగి ఆటో మాట్లాడి సుమిత్ర ఇంటి ఎడ్రస్ చెప్పారా దంపతులు.

ఇంటిముందు గుమిగూడిన జనాన్ని చూడగానే వారి మనస్సు కీడునే శంకించింది. లోపలికెళ్ళగానే తెల్లగుడ్డతో కప్పబడిన సుమిత్ర శవాన్నే చూశారా దంపతులు.

ఒక్కసారిగా గొల్లుమంది సత్యవతమ్మ కూతురి శవంమీదపడి. ఎందరాపబోయినా ఆగటంలేదా మాతృమూర్తి దుఃఖం.

హనుమంతరావు గంభీరంగా నాలుగువైపులకి చూశాడు.

అల్లుడు సతీష్ రెండుచేతుల్లో ముఖాన్ని కప్పుకుని ఓ మూలగా కూర్చున్నాడు. సుమిత్ర అత్తగారు రామలక్ష్మమ్మ లబోదిబోమంటూ ఏడుస్తూ గుండెలు బాదుకుంటోంది మధ్యమధ్యలో. మామగారు చంద్రయ్య చేతులు వెనక్కి కట్టుకుని పచార్లు చేస్తున్నాడు. వచ్చిన జనం రామలక్ష్మమ్మని, సత్యవతమ్మల్ని ఊరడించడానికి ప్రయత్నిస్తూ, మధ్య మధ్యలో సుమిత్ర నెమ్మది, నమ్రతల్ని పొగుడుతున్నారు.

హనుమంతరావు కళ్ళు నిప్పుకణాల్లా ఎర్రబడి పోతున్నాయి. ఆయనలో ఆవేశం, క్షణక్షణానికి పెరిగిపోతున్నట్లు ఆయన ముఖమే సాక్ష్యమిస్తోంది. ఇక పట్టలేనట్లుగా విసురుగా వెళ్లి పచార్లు చేస్తున్న వియ్యంకుడి చొక్కా కాలరు పట్టుకుని ఒక్క గుంజుగుంజాడు.

అక్కడి జనమంతా ఈ చర్యకి చకితులై హనుమంతరావునే చూడసాగారు.

"రాస్కెల్! నా కూతుర్ని పొట్టనపెట్టుకున్నావురా! నా బిడ్డ చావలేదురా! మీరు చంపేర్రా! చంపేరు!! నా పిల్లని హత్యచేసినట్లు సాక్ష్యం వుందిరా! ఇప్పుడే పోలీస్‌స్టేషన్‌కెళ్ళి రిపోర్టిచ్చి మీ అందర్నీ కటకటాల్లోకి తోయిస్తాన్రా" అంటూ వెర్రిగా అరుస్తూ, రంకెలేస్తున్న హనుమంతరావుని పట్టుకుని, చంద్రయ్య చొక్కా విడిపించి, శాంతింప జెయ్యడానికి ప్రయత్నించారు అక్కడికొచ్చిన పెద్దలు.

"ఇది హత్యేనని పోలీస్ రిపోర్టిచ్చివస్తా"నంటూ బైటికెళ్ళాడు హనుమంతరావు.

అంతదాకా ఏడుస్తున్న రామలక్ష్మమ్మ ఒక్కసారిగా, ఏడుపుమాని " ఈ పిల్లని కట్టుకోడం కాదుగానీ, మా పరువంతా మంటగలుపుతున్నారు తల్లో" అంటూ తిట్టిపొయ్యసాగింది.

చంద్రయ్య, సతీష్ ముఖాల్లో ఆందోళన స్పష్టంగా కనపడసాగింది.

మరో అరగంటకి పోలీసులు జీప్‌లో వచ్చి హనుమంతరావు చెప్పిన స్టేట్‌మెంట్ రాసుకున్నారు.

చంద్రయ్యనడగ్గానే "రాత్రి గుండెలో నొప్పంటే ఆసుపత్రికి తీసుకెళ్ళాం. తోవలోనే పోయింది. గుండెపోటుతో మరణించినట్లు డాక్టర్ సర్టిఫికెట్ కూడా ఇచ్చాడు – ఇదిగో" అంటూ డాక్టరిచ్చిన రిపోర్ట్ చూపించాడు.

హనుమంతరావుకేసి చూస్తూ "ఇది హత్యని రుజువుచెయ్యగలరా?" అని అడగ్గానే వస్తూ తెచ్చిన కవరు జేబులోంచి తీసి సుమిత్ర తనకి రాసిన ఆఖరి ఉత్తరాన్ని చూపించాడు. అందులో 'తన పెళ్ళికిచ్చిన కట్నం మూడులక్షలూ చాలలేదని, మీ

నాన్ననడిగి మరో మూడు లక్షలు తెమ్మని, మెడిసిన్ చదివిన తన కొడుక్కి ఆరు లక్షలు ఇస్తామంటూ వచ్చిన సంబంధాలను మావాడు నిన్ను వరించి చేసుకోవడంవల్ల వదులుకోవలసి వచ్చిందని అత్తమామలు చాలా హింసిస్తున్నారని, పెళ్ళికిముందు ప్రేమకబుర్లు చెప్పిన భర్తకూడా మూడులక్షలు తెస్తే ప్రాక్టీస్ పెడతానని బాధిస్తున్నాడని రాయడమే కాకుండా, "నాన్నా! మీరు ఆ మూడు లక్షలూ ఇచ్చి నా ప్రాణాలు కాపాడతారో, లేక మీ కూతుర్ని చంపేసుకుంటారో అన్నది నిర్ణయించుకోడం మీ చేతుల్లో వుంది" అంటూ రాసి ముగించిన ఉత్తరాన్ని పోలీసాఫీసర్‌కి చూపించాడు.

అన్నీ నోట్‌చేసుకుని పోలీసులు శవాన్ని పోస్ట్‌మార్టంకి పంపారు.

అంతదాకా దుఃఖసముద్రంలా ఉన్న ఆ ఇంట్లో వాతావరణం ఒక్కసారిగా తుఫాన్ వచ్చినట్టు అల్లకల్లోలంగా తయారైంది. ఆడా, మగా చెవులు కొరుక్కోసాగారు. అంతా సుమిత్ర అత్తమామల్ని అసహ్యంగా చూడసాగారు. కొందరు అత్తగార్లు డబ్బుకోసం కోడళ్ళని పెడుతున్న హింసల్ని, చేస్తున్న హత్యల గురించి చెప్పుకుని దూషించసాగారు.

ఆ గొడవల్లో ఇరుక్కోడం ఇష్టంలేక వచ్చిన వాళ్ళంతా పోలీసుల్ని చూసి నెమ్మదిగా బైటికి జారుకున్నారు.

సత్యవతమ్మ తన ఏడుపు ధోరణి మార్చి "ఈ రాక్షసులు నా బిడ్డని పొట్టనపెట్టుకున్నారమ్మో! నా సుమిత్రని చంపేశారు తల్లోయ్" అంటూ రకరకాలుగా వియ్యాలవారిని దూషిస్తూ గోలెడుతుంటే –

"నోరు మూసుకోవమ్మా! నీ కూతురొచ్చి ఆర్నెల్లన్నా కాలేదు గుట్టుగా బతుకుతున్న మమ్మల్ని రోడ్డెక్కించి, నలుగురినోళ్ళల్లో పడేసిం"దంటూ చచ్చిన కోడల్ని తిట్టితిట్టిపొయ్యసాగింది.అంతదాగా సుమిత్రకోసం పక్కనే కూర్చుని గుండెబాదుకుంటూ ఏడ్చిన అత్తగారు.

చంద్రయ్య సతీష్‌ని గదిలోకి తీసుకెళ్ళి ఏదో రహస్యంగా మాట్లాడాడు. వాళ్ళిద్దరి ముఖాల్లో గాబరా, భయం స్పష్టంగా కనపడుతోంది.

బైటికెళ్ళిన సతీష్ మరో అరగంటకి మామగార్ని ఆసుపత్రి నుంచి తీసుకుని ఆటోలో వచ్చాడు.

లోపలికడుగెట్టిన హనుమంతరావు కాళ్ళు రెండూ పట్టుకుని కేసు విరమించుకోమని బతిమాలసాగాడు చంద్రయ్య.

వియ్యంకుడు బతిమాలుతున్నకొద్దీ రెచ్చిపోతున్నాడు హనుమంతరావు.

కొడుకు ప్రేమించి పెళ్ళి చేసుకుంటున్న పిల్లనైనా మూడు లక్షలకి తక్కువ కట్నమైతే చేసుకోనన్నాడు చంద్రయ్య. కొంత పొలం తాకట్టుపెట్టి వాళ్ళడిగిన కట్నం ఇచ్చాడు. మారుతీకారు ఇస్తేగానీ అలకపాన్పు దిగనని పట్టుబట్టిన అల్లుడిని బతిమాలి, అతను ఒప్పుకోకపోయేసరికి వియ్యంకుడి చేతులుపట్టుకుని బతిమాలసాగాడు హనుమంతరావు – "పెద్దపిల్ల పెళ్ళికే వున్నదంతా ఊడ్చి ఇస్తే రెండోపిల్ల పెళ్ళి ఎలాచెయ్యగల"నని బతిమాలినా వినిపించుకోలేదు వియ్యంకుడు కూడా. మరికొంత పొలం, తాకట్టు పెట్టి అల్లుడి ఆ కోరికని కూడా తీర్చాడు హనుమంతరావు.

అంతేకాదు – అలా అడుగడుక్కి ప్రతీ లాంఛనం వాళ్లు వందలవి వేలల్లోనే చేయించుకున్నారు.

కూతురి పెళ్ళిచేసి, సారెయిచ్చి అత్తవారింటికి పంపేనాటికి హనుమంతరావు పొలమంతా తాకట్టు పెట్టగా, బ్యాంకులో ఉన్న డబ్బంతా ఖాళీ అయిపోయింది. పోనీ పిల్ల సుఖపడుతుందని అంతచేసినా, ఆరునెలలు తిరక్కుండా మళ్ళీ మరో మూడు లక్షలు అల్లుడి ప్రాక్టీస్‌కి అడగడం, తాము ఇవ్వలేనిదానికి ఫలితంగా సుమిత్రని హత్యచెయ్యడం జరిగిందని తెలుసుకున్న హనుమంతరావుకి పెళ్ళినాటి సంఘటనలన్నీ గుర్తొచ్చి 'రోజులు తిరగబడ్డాయి. కక్ష తీర్చుకోడానికి ఇదే అద'నుకుని నరసింహావతారమెత్తినట్లు "మిమ్మల్ని ఉరికంబాలకి ఎక్కించేదాకా నేను నిద్రపో"నంటూ వాళ్ళు బతిమాలుతున్నకొద్దీ బిగిసిపోయి ఎగరసాగాడు.

అల్లుడు కూడా వచ్చి మామగారి కాళ్ళు చుట్టేసుకున్నాడు. అంతదాకా తిట్టిపోస్తున్న రామలక్ష్మమ్మ కూడా వియ్యపురాలి కాళ్లు పట్టేసుకుని "అన్నయ్యగారికి చెప్పమ్మా వదినా! మా పరువు కాపాడుతల్లీ!" అంటూ పరిపరివిధాల బతిమాలసాగింది. తెల్లవారింది. శవపరీక్ష జరిగాక శవాన్ని సుమిత్ర తరపువారికి అప్పగించారు. సుమిత్రకి దహనసంస్కారాలు జరిగాయి. మరోగంటకి హనుమంతరావు భార్యని తీసుకుని తిరుగుప్రయాణమయ్యాడు.

పుట్టెడు దుఃఖంతో సత్యవతమ్మ ఇంటికి వస్తుంటే వెళ్ళినప్పటికంటే రెట్టింపు గంభీరంగా హనుమంతరావు బస్సెక్కాడు.

ఇంటికి, వచ్చిన మర్నాడే, హనుమంతరావు ఐదు లక్షలరూపాయిలిచ్చి పొలం తాకట్టు విడిపించుకున్నాడు. ఆరులక్షల రూపాయిలు తన పేర పిల్లపేర, భార్యపేర బ్యాంకుల్లో వేసుకున్నాడు.

అంతదాకా ఓ శ్రోతలా అన్నీ వింటూ, చూస్తున్న సత్యవతమ్మ భర్త దగ్గరకెళ్ళి 'ఏమిటండీ! ఇదంతా?! వాళ్ళని ఉరికంబాలకి ఎక్కిస్తానంటూ పులిలా వాళ్ళమీద విరుచుకుపడ్డ మీరు మేకలా నోరువిప్పకుండా తిరిగిరావడమే కాకుండా, ఒక్క రోజులో పొలం తాకట్టు విడిపించి, మనపేర్లమీద ఇంతింత డబ్బు వేశారేమిటండీ! ఎక్కడిది ఇదంతా?" అని అడగ్గానే పెద్దగా నవ్వుతూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

సుమిత్ర పెళ్ళికి ఖర్చుచేసిన ఆరు లక్షలకి రెట్టింపు అంటే పన్నెండు లక్షల కేష్ ఇస్తే కేసు విరమించుకుంటానని బేరమాడిన హనుమంతరావు "బాబ్బాబు ఏడు లక్షలదాకా ఇచ్చుకోగల"మని కాళ్ళబేరానికొచ్చినా" పన్నెండు లక్షలు ఇస్తారో - ఉరికంబాలకి ఎక్కుతారో నిర్ణయించుకోం"డంటూ పెళ్ళినాడు వాళ్ళు పట్టిన పట్టుకి రెట్టింపు బిగిసి ఒక్క పైసా తగ్గననడంతో, ఉన్న ఆస్తే కాకుండా భార్య వంటినున్న బంగారం పుస్తె, పుడకతో సహా అంతా అమ్మి, మిగిలింది అప్పుచేసి చంద్రయ్య రాత్రికి రాత్రి హనుమంతరావు చేతిలో పోసిన డబ్బులో లక్ష రూపాయిలు డాక్టర్‌కి, పోలీసులకి ఇచ్చి కేసు రూపు మార్పించి, మిగిలినదాంతో తను పెట్టిన పొలం తాకట్టు విడిపించి, మిగతా సొమ్ము బ్యాంకుల్లో వేసినట్టు ఈ ఇంట్లో హనుమంతరావుకి తప్ప మరెవ్వరికీ తెలీదు.

హనుమంతరావు చంద్రయ్య కుటుంబంమీద కక్ష తీర్చుకున్నట్లే తనూ వాళ్ళని చావుదెబ్బతీశాడనుకోవాలా? లేక కూతుర్ని డబ్బుతో కొలిచే హనుమంతరావు వంటి తండ్రులుంటారనుకోవాలా??

ఎవరెలా అనుకున్నా కటకటాలు, ఉరిశిక్ష తప్పాయని చంద్రయ్య కుటుంబం ఆనందిస్తుంటే, తన ఆస్తి తనకి తిరిగొచ్చిందని, రెండోపిల్ల పెళ్ళి గురించిన బెంగ తీరిందని హనుమంతరావు ఆనందిస్తున్నాడు. ఇక ఈ కథ చదివి మీరేమంటారు?

వనితా జ్యోతి మాసపత్రిక

**డిసెంబరు 1997**